క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలిగా రంగినేని ఉమ



ఉమకు శుభాకాంక్షలు తెలుపుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

చివ్వెంల : సూర్యాపేట పట్టణానికి చెందిన రంగినేని ఉమా లక్ష్మణ్‌రావు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలిగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర సహా ఎన్నికల అధికారి కె.గీతామూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు బుధవారం స్థానికంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీరేందర్, హబీబ్, చలమల్ల నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

చివ్వెంల : హైకోర్టులో వాదనలు వినిపిస్తూ గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ న్యాయవాది పసునూరి గోపాల్‌రావు మృతి పట్ల సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. అనంతరం విధులు బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని మూసీనది వెంట ఉన్న గంగదేవమ్మ ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి బుధవారం రూ.1.20లక్షలను ముదిరాజ్ సంఘం నాయకులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో తిరుమలగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుడిపల్లి సోమిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, నర్సింగ వెంకటేశ్వర్లు గౌడ్, జలేందర్, సైదుల కిరణ్, నిమ్మల కుమార్, సంఘం నాయకులు మామిడి వెంకన్న, గీస భద్రయ్య, భిక్షం, జానయ్య పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడాపోటీలు



క్యారమ్ ఆడుతున్న క్రీడాకారులు

భానుపురి (సూర్యాపేట) : ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కోదాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడలకు క్రీడాకారులను ఎంపిక చేసేందుకు గాను బుధవారం సూర్యాపేట కార్యాలయంలో జిల్లా స్థాయి చెస్, క్యారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడల్లో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, మండల శాఖ అధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి, జిల్లా కోశాధికారి అమీర్‌ఖాన్, బి.వెంకన్న, ఎస్.యాదగిరి, ఎంఎస్ఎన్ రాజు, చంద్రశేఖర్, భ్రమరాంబ, కృష్ణమాచార్యులు ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం

పెన్‌పహాడ్ : దాతల సహకారం అభినందనీయమని పాఠశాల హెచ్ఎం పిండిగ నరసయ్య అన్నారు. బుధవారం మండలంలోని దోసపహాడ్ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన కరణం రామానుజమ్మ–నగేష్‌వర్మ దంపతులు కరుణం నరసమ్మ జ్ఞాపకార్థం సైన్స్, సోషల్ బొమ్మలు వేయించడానికి రూ.15వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో కరణం బక్కయ్య, మామిడి వెంకన్న, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దగట్టులో సంకినేని పూజలు



పూజలు చేస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

చివ్వెంల : పెద్దగట్టు శ్రీలింగమంతుల స్వామిని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు అయితగాని జానయ్యగౌడ్, ఎండీ వాజిద్‌మియా, ప్రసాద్, వీరేంద్ర, అబిద్, నరసింహ ఉన్నారు.

జోహార్‌కు ప్రశంసాపత్రం

తుంగతుర్తి : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కొమ్ము జోహార్ బుధవారం హైదరాబాద్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువక్రాంతి బునయాది' కార్యక్రమంలో ప్రశంసాపత్రం అందుకున్నాడు. యువజన కాంగ్రెస్ శిక్షణా చివరి రోజున ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అందజేసినట్లు జోహార్ తెలిపారు.



గట్టుపైకి బారులు : లింగమంతుల స్వామి జాతరకు తరలివచ్చిన భక్తులు



మళ్లీ రెండేళ్లకు : దేవరపెట్టెను కేసారం గ్రామానికి తరలిస్తున్న యాదవులు



ఓ లింగా.. ఓ లింగా : నృత్యాలు చేస్తున్న మహిళా భక్తులు



జాతర గుర్తుండి పోవాలి : సెల్ఫీ తీసుకుంటున్న యువతి

విద్యార్థికి కనీస సామర్థ్యాలు కల్పించాలి

● కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ తూచా తప్పకుండా అమలు పరచడం ద్వారా ప్రతి విద్యార్థికి కనీస సామర్థ్యాలు కల్పించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ అధ్యక్షతన అన్ని మండలాల ఎంఈఓలు, నోడల్ అధికారులు, కాంప్లెక్స్, ప్రభుత్వ స్థానిక సంస్థల ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్స్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలు పర్చాలన్నారు. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్, ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో విద్యార్థుల ప్రగతిని నమోదు చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడమే కాకుండా 70శాతం కనీస మార్కులు సాధించాలని, ప్రతి పాఠశాలలో 10శాతం విద్యార్థులైన 10జీపీఏ సాధించాలని అన్నారు. సమావేశంలో డీఈఓ అశోక్, మండల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఈ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డ ఎస్ఈ విద్యుత్ సర్కిల్ కార్యాలయాన్ని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో ప్రతిరోజు విద్యుత్తు వినియోగం.. లోడ్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చే వేసవి దృష్ట్యా వ్యవసాయం, నిర్మాణ, గృహ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తదుపరి సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ లోడ్స్ పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈ ఫ్రాంక్లిన్, డీఈ టెక్నికల్ దాలీనాయుడు, ఏడీఈ కమర్షియల్ పి.అశోక్, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బంజారాల ఆరాధ్యదైవం సంతు సేవాలాల్

● ఎమ్మెల్యే మందుల సామేల్



తుంగతుర్తిలో సంతు సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : బంజారాల ఆరాధ్యదైవం సంతు సేవాలాల్ అని, ఆయన గొప్ప సంఘసంస్కర్త అని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీసంతు సేవాలాల్ జయంతిలో ముఖ్యఅతిథిగా పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సేవాలాల్ మన పాటలు రచనల ద్వారా ప్రజలను జాగృతం చేయడానికి అనేక ప్రబోధాలను బోధించిన మహనీయుడని అన్నారు. బంజారాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశాడని అన్నారు. సేవాలాల్ ఇతర కులాలకు ఆదర్శమూర్తిగా నిలిచాడని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకు సంతు సేవాలాల్ బోధనలు అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, నూతనకల్ సొసైటీ చైర్మన్ జయసుధ, పార్టీ మండల నాయకుడు దొంగరి గోవర్ధన్, దాసరి శ్రీను, గిరిజన నాయకులు ధరావత్ జమిలాల్, గుగులోతు కాల్‌రామ్, సోమ్లానాయక్, గుగులోతు రాజారామ్, భానుతు శ్రీను, కృష్ణనాయక్, నాగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని బుధవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడారు. సేవాలాల్ బోధనలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ నాయకుడు గుగులోతు సుధాకర్‌నాయక్, రమావత్ లాలునాయక్, కేతావత్ రవి, లునావత్ వెంకన్న రమావత్ లక్షణ్, సుమన్, రణధీర్, కిరణ్‌కుమార్, సోమన్న, సతీష్, వెంకటేష్, వెంకన్న, మురళి, రాము, నవీన్, రాజేందర్, కిరణ్, స్వామి, లింగయ్య పాల్గొన్నారు.

కోలాట బృందానికి ఎమ్మెల్యే అభినందన

నూతనకల్ : మండల పరిధిలోని బక్కహేమ్లాతండా గ్రామానికి చెందిన కోలాట బృందాన్ని ఎమ్మెల్యే మందుల సామేల్ బుధవారం అభినందించారు. తుంగతుర్తిలో నిర్వహించిన శ్రీ సంతుసేవాలాల్ జయంతిలో ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకోవడంతో బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కోలాట బృందానికి తన సొంత ఖర్చులతో కోలాటం నేర్పించిన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గుగులోతు కృష్ణను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణా, శంకర్‌నాయక్, లవకుశ, రాజునాయక్, దామోదర్‌నాయక్ పాల్గొన్నారు.

బ్యాంకర్లు ఇచ్చిన లక్ష్యాలను సాధించాలి

● అదనపు కలెక్టర్ రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

భానుపురి (సూర్యాపేట) : బ్యాంకర్లు ఇచ్చిన లక్ష్యాలు సాధించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని కలెక్టరేట్‌లో కన్వీనర్ బాపూజీతో కలిసి నిర్వహించిన డీసీసీ త్రైమాసిక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బ్యాంకర్లు పంట రుణాలు, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు, ప్రాధాన్యత రంగాలకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. పంట రుణాల్లో ఈ వార్షిక బడ్జెట్‌లో రూ.2942.48 కోట్లు లక్ష్యం కాగా రూ.3406.84 కోట్లు సాధించి 115.78 శాతం వృద్ధి సాధించారని తెలిపారు. దీర్ఘకాలిక వార్షిక బడ్జెట్‌లో రూ.2683.44కోట్లు లక్ష్యం కాగా రూ.1916.66 కోట్ల లక్ష్యాలను సాధించి 71.42 శాతం వృద్ధి సాధించారన్నారు. కొన్ని బ్యాంకులు రుణాలు అందించడంలో వెనకబడి ఉన్నాయని, త్వరగా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రైతులకు పంట రుణాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌బీఐ ఏజీఎం రెహమాన్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ దినేష్, అన్ని బ్యాంక్‌ల కంట్రోలర్లు, జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఇండస్ట్రియల్ అధికారి సీతారాం, మత్స్యశాఖ అధికారి నాగులు, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ శ్రీనివాసనాయక్, మైనార్టీ అధికారి జగదీశ్వర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా హంసవాహన సేవ



హంసవాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి హంసవాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహస్వామి, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవిలను హంసవాహనంపై దేవాలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించిన అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొరెపడత అవిలయ్య, ఈఓ వై.శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, ధర్మకర్తలు రాగి అనిల్, దిర్శనపు కృష్ణమూర్తి, వెంకట్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



భానుపురి (సూర్యాపేట) : సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్‌కుమార్

భానుపురి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయాలని కోరుతూ గురువారం హైదరాబాదులోని ఇందిరాపార్క్‌లో నిర్వహించే బహిరంగ సభకు జిల్లా నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక చంద్రాపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తానని చెప్పి సంవత్సరం పూర్తయిన అమలు చేయడంలో వైఫల్యం చెందారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు, పెంచిన పెన్షన్లు, వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, సామ నర్సిరెడ్డి, రమేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద గురువారం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, ముప్పాని సుదర్శన్‌రెడ్డి, మండడి భూపాల్ రెడ్డి, మల్లయ్య, శ్రీను, మణికుమార్, భోనగిరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే లక్ష్యం

నూతనకల్ : సమాజంలో పేద వృద్ధులను ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరుగు సంసోను అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిల్పకుంట్లలో ఐనోన్ కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాస్టర్ డేవిడ్, ప్రేమ్‌కుమార్ చేతుల మీదుగా 50మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృపా మినిస్ట్రీస్ ఫౌండర్ డైరెక్టర్ భువనగిరి లింగయ్య, శార యశోధమ్మ, లింగమ్మ, ఇజ్రాయిల్, బాలరాజు, కృపమ్మ పాల్గొన్నారు.

శివాజీ జీవితం యువతకు మార్గదర్శకం



పెన్‌పహాడ్ : పొట్లపహాడ్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న శివాజీ స్మారక సమితి సభ్యులు

పెన్‌పహాడ్ : ఛత్రపతి శివాజీ జీవితం యువతకు మార్గదర్శకమని అమ్మ హాస్పిటల్ అధినేత, డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ స్మారక సమితి ఆధ్వర్యంలో బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువతలో దేశభక్తిని పెంపొందించాలనే సంకల్పంతో యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో త్వరలోనే కులమతాలకు అతీతంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యగ్గడి శ్రీకాంత్, రామకృష్ణ, జల్లేపల్లి అజయ్, దాచేపల్లి సందీప్, భారత్, ప్రవీణ్, శ్రీనివాస్, మేకపోతుల అజయ్, గోకని వినయ్ పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని తాటిపాముల గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు రేగుల అనిల్, ఉపాధ్యక్షులు కారుపోతుల మధు, నవీన్, కుమార్, నరేష్, గణేష్, యాకన్న, ఉదయ్, సందీప్, ఉమేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలోని తెలుగు బాప్టిస్టు ప్రార్థనా మందిరంలో గ్రామానికి చెందిన మేకల గామయ్య–శారమ్మల జ్ఞాపకార్థం మనువరాలు నకిరేకంటి సుజాత–భార్గవ్ దంపతులు బుధవారం 20మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ నాగేల్లి మల్సూర్, నన్నెపంగి నవీన్, గుగ్గిళ్ల మట్టయ్య, మేకల సైదులు, మల్సూర్, మాతంగి భిక్షం, శ్యాంసన్, రమేష్, మాతంగి కలమ్మ, శారద, జానకమ్మ, పుష్ప, అడ్డి కేశవులు, దొంగరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని రైతుల ధర్నా



సాగునీటి కోసం ధర్నా చేస్తున్న రైతులు

నూతనకల్ : పంటలకు గోదావరి జలాలు అందించాలని మండల పరిధిలోని ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద దంతాలపల్లి–సూర్యాపేట ప్రధాన రహదారిపై రైతులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. 69డీబీఎం ద్వారా మండల పరిధిలోని గ్రామాలకు గోదావరి జలాలు అందించాల్సి ఉన్నప్పటికీ నేటి వరకు మండలానికి నీరు చేరకపోవడం అధికారులు, పాలకుల వైఫల్యమన్నారు. కాల్వల్లో నీరు పారకపోవడంతో భూగర్భజలాలు అడుగంటడంతో పాటు పొట్టదశకు వచ్చిన వరి పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఆరుగాలం కష్టించి పనిచేసిన రైతన్నకు గోదావరి జలాలు రాక కన్నీటిని మిగిలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మండల పరిధిలోని గ్రామాలకు గోదావరి జలాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మద్ది సంజీవరెడ్డి, మాదిరెడ్డి మధుసూధన్‌రెడ్డి, భయ్యా అశోక్, సాబాది చంద్రారెడ్డి, లింగారెడ్డి, దేవిరెడ్డి మల్లారెడ్డి, ఏసు, రవి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

అర్వపల్లి : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని అర్వపల్లి శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి అన్నారు. అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి దేవాలయ ఆవరణలో నల్లగొండ ఉమ్మడి జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ బాలుర కబడ్డీ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కె.అవిలయ్య, ధర్మకర్త రాగి అనిల్, బైరబోయిన మహారాజు, సైదులు, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, కనుకు శ్రీనివాస్, అల్వాల వెంకటస్వామి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు, పీడీ పి.మల్లేష్, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్ పాల్గొన్నారు.

సాగు, తాగునీటి సమస్య పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

నూతనకల్ : వేసవిని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయానికి సాగునీరు, ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇరిగేషన్, వ్యవసాయ, పంచాయతీ కార్యదర్శులు, పోలీసు సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీరాంసాగర్ రెండో దశ పరిధిలోని 69డీబీఎం నుంచి వ్యవసాయం కొరకు విడుదలయ్యే నీటిని సక్రమంగా అందించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని, మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్న నీరు సరిపోని సమయంలో అద్దె మోటార్ల ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించాలని, కాల్వలకు అక్రమంగా ఏర్పాటు చేసిన మోటార్లను తొలగించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ హరికృష్ణ, ఎంపీడీఓ శశికళ, మండల వ్యవసాయ అధికారి మురళీబాబు, పంచాయతీ కార్యదర్శులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీటిని పొదుపుగా వాడుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

మద్దిరాల : ఎస్సారెస్పీ నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సారెస్పీ నీటిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. యాసంగి సీజన్‌లో పంటలు ఎండిపోకుండా ఎస్సారెస్పీ నీటిని 69 డీబీఎం ద్వారా చివరి ఆయకట్టు వరకు నీటి లభ్యత గురించి చర్చించారు. ఎండల తీవ్రత పెరగడంతో పంటలు ఎండిపోయే అవకాశం ఉన్నందున ఎస్సారెస్పీ నీటిని రైతులు వృథా చేకుండా జాగ్రత్తగా వాడుకోవాలని అన్నారు. చాలా మంది రైతులు వారబంధీతో చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదని, నిరంతరాయంగా విడుదల చేయాలని రైతులు విన్నవించుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏఓ అనిషారూహీ, ఏఎస్ఐ మల్లయ్య, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

నాగారం : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో 2008 డీఎస్సీ అభ్యర్థులకు బుధవారం మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ నియామపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2008 డీఎస్సీ అభ్యర్థులను ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా నియమించిందని, ఇందులో భాగంగా మండలానికి నూతనంగా వచ్చిన ఐదుగురు కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతితో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్ : వరిలో డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతులతో (నేరుగా విత్తే వరిసాగు) అధిక దిగుబడులు పొందవచ్చని కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తలు డి.నరేష్, ఎ.కిరణ్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని అనాజీపురం గ్రామంలో ఐసీఎఆర్ భారతీయ వరి పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో రైతులకు వరిలో డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతుల వరిలో డ్రోన్ ద్వారా కలుపు మందు పిచికారీపై శిక్షణ కల్పించారు. అదే విధంగా చీడపీడల సమస్య, నీటి యాజమాన్య పద్ధతులు, కలుపు యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. నేరుగా వరివిత్తడం ద్వారా కూలీల సమస్యను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ అనిల్‌కుమార్, ఏఈఓ మురళీ, మాజీ సర్పంచ్ చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, రైతులు నాగిరెడ్డి, సైదులు, చినబాబు, వెంగల్‌రెడ్డి, సంధ్య పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలి

అర్వపల్లి : ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని కాంగ్రెస్ నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి అన్నారు. జాజిరెడ్డిగూడెం గ్రామంలోని క్రీడాకారులకు బుధవారం ఆయన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, మహారాజు, సైదులు, తాటిపాముల జలేందర్, నిమ్మల కుమార్, సైదుల కిరణ్, సర్దార్, శ్రీకాంత్, గ్రామస్తులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

నాగారం : నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కుంభం కర్ణాకర్ కోరారు. బుధవారం మండల పరిధిలోని ఈటూరు జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డికి తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీతో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లింగయ్య, చింటు, సాయిలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.